క్లుప్తంగా

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రముఖ సినీ నటుడు రామచరణ్ జన్మదినం సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఆదివారం జెడ్పీ ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో చిరు అభిమానులు రక్తదానం చేశారు. అఖిల భారత చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్ర బాబు మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం మెగాస్టార్ ఫ్యామిలీ అన్నారు. తండ్రికి మించిన తనయుడిగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలు మహోన్నతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు, మెగా అభిమానులు గిడుతూరి సత్యం, దుంపాల హరిబాబు, కందా బాబు, యుగంధర్ నాయుడు, సూరిబాబు గౌడ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం



పట్నంబజారు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాసనగర్‌లో నివాసం ఉండే చుండూరి నాగరాజు దుస్తులు ఉతికే పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు అధికమై ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల నివాసాల్లో కుటుంబసభ్యులు అడిగినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో నాగరాజు భార్య రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 8688831325, 8688831329 నంబర్లకు సమాచారాన్ని అందించాలని పోలీసులు కోరారు.

ఫార్మసిస్టు జయనాబికి సన్మానం



గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్యశాఖలో 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఫార్మాసిస్టులను ప్రభుత్వం రెగ్యులర్ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రెగ్యులర్ అయిన ఉద్యోగులంతా విజయవాడలోని సీటీయు కార్యాలయంలో ఆదివారం సమావేశమయ్యారు. పోస్టులు రెగ్యులర్ అయ్యేందుకు కృషి చేసిన ఫార్మసీ ఆఫీసర్ అసోసియేషన్ నేతలను ఘనంగా సత్కరించారు. అందులో భాగంగా గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని ఫార్మాసిస్టు స్టోర్స్‌లో ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ జయనాబి, యూనియన్ అధ్యక్షుడు రత్నాకర్‌బాబు, విజయ్ తదితరులను ఘనంగా సన్మానించారు.

పెన్షనర్ల సమస్యల్ని పరిష్కరించాలి

జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్ల సంఘం జాతీయ నాయకుడు గురుమూర్తి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్నట్లే జనరల్ ఇన్స్యూరెన్స్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్, ఇతర సదుపాయాలు కల్పించాలని పెన్షనర్ల సంఘం జాతీయ నాయకుడు గురుమూర్తి కోరారు. ఆదివారం అమరావతి రోడ్డులో జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ రెండవ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గురుమూర్తి మాట్లాడుతూ సాధారణ బీమా సంస్థలను విలీనం చేసి, పరిశ్రమకు రక్షణ కల్పించాలని కోరారు. సాధారణ బీమా ఉద్యోగుల వేతన వేతన సవరణను సత్వరమే చేయాలనే డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నట్లు వివరించారు. సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో సాధారణ బీమా మహిళా పెన్షనర్స్ సంఘం సామాజిక బాధ్యతతో చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఇందిరా ప్రేమజ్యోతి, శారదను ఘనంగా సత్కరించారు. సాధారణ బీమా పెన్షనర్లకు ఉద్యోగులకు జీతాలు పెరిగినప్పుడు పెన్షన్ అప్డేషన్‌తో పాటు ఫ్యామిలీ పెన్షన్ 30 శాతానికి పెంచాలని జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గద్దె పానకాలరావు అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శి మన్నవ సాంబశివరావు నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. సుబ్బారావు, కార్యదర్శి సాల్మన్ రాజు, కోశాధికారి కృష్ణారావు, ఆదినారాయణ, వై.చిన్నపరెడ్డి, జిల్లా విశ్రాంత ఉద్యోగులు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలో ప్రతి ఇంటికీ మేలు

- బడుగు, బలహీనవర్గాల ఆర్థికస్థితిగతులు ఎంతో మెరుగు
- సంక్షేమ పథకాల అమలులో సరికొత్త చరిత్ర
- జగనన్న వెంట నడిచేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ, జనసేన నుంచి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో మంత్రి రజిని

పట్నంబజారు: జగనన్న పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. స్థానిక చంద్రమౌళీనగర్‌లోని మంత్రి కార్యాలయంలో ఆదివారం 100 మందికిపైగా టీడీపీ, జనసేన కార్యకర్తలు మాల మహానాడు గుంటూరు నగర అధ్యక్షుడు జె.నాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఈ దేశ చరిత్రలోనే సరికొత్త చరిత్రకు నాంది పలికాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలు ఎంతో స్వేచ్ఛగా జీవించే రోజులు ఆయన ముఖ్యమంత్రి అయ్యాక వచ్చాయని పేర్కొన్నారు.

రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో 50 శాతానికి పైగా, చట్టసభల్లో 50 శాతానికిపైగా, ఎస్సీ, ఎస్టీ, బీసీలకే అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ చరిత్రలో తొలిసారి బీసీ మహిళకు పోటీ చేసే అవకాశం కల్పించిన ఘనత కూడా జగనన్నదని పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆర్థికస్థితిగతులు ఈ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎంతగానో మెరుగయ్యాయని, అనేక జాతీయ సర్వేలు, కేంద్ర సంస్థలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయని తెలిపారు. పేదింటి బిడ్డకు పూర్తి ఉచితంగా అత్యుత్తమ విద్యను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. పేదలకు అత్యుత్తమ వైద్యం ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం కూడా తమదేనని తెలిపారు.

జగనన్న పాలనను మెచ్చే...

సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను మెచ్చే ప్రజలంతా స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీకి ఆకర్షితులవుతున్నారని మంత్రి రజిని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి భారీగా చేరుతున్నారని, సామాజిక న్యాయం మన పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని ప్రజలు నమ్మారని చెప్పారు. చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో కుట్రలు, కుతంత్రాలకు తెరతీస్తారని, ఆయన మాయ మాటలను నమ్మేందుకు ప్రజలు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. అనంతరం గుంటూరు నగరం 29, 31 డివిజన్ల నుంచి టీడీపీ, జనసేనకు చెందిన శ్రీకాంత్, ఇమ్మానుయేల్, దుర్గా, మధు, అన్సర్, రాజేష్, పవన్, గోపి, కరీముల్లా, నరసింహ, జి.శ్యామ్, జె.పున్నయ్య, వై.రవికుమార్, కె.హరిబాబు, రాహుల్, బి.శ్యామ్, జీవరత్నం, పి.సుజిత్, సుమన్ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

పేదల భవిష్యత్తు జగనన్నతోనే భద్రం



మంత్రి రజినిని సత్కరిస్తున్న వెంకట్రావు దంపతులు

పట్నంబజారు: రాష్ట్రంలో పేదల భవిష్యత్తు భద్రంగా ఉండాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. నగరంలోని దేవాపురం 5వ లైనులో బర్మా వెంకటరావు నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కూటములు కట్టినా పేదలంతా జగనన్నను గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడని ప్రజల్లో నమ్మకం బలీయంగా ఉందని, చంద్రబాబు హామీలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. విశ్వసనీయతకు మారుపేరైన జగనన్న గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కుల, మత, పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీకి పాజిటివ్ ఓటు ఉందని, మేలో జరిగే ఎన్నికల్లో అఖండ విజయం సాధించి చరిత్ర సృష్టించనుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు కణతం సాంబయ్య నిర్వహించారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ గోపి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న అతిథులు, ఆలయ కమిటీ సభ్యులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, నిత్య హోమం, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణలు నిర్వహించారు. విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ స్వహస్తాలతో హోమ పూర్ణాహుతి అనంతరం వేల సంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. శ్రీవశిష్ఠాశమం ఉత్తరాధికారి శ్రీ విశ్వంభరానందగిరిస్వామి, శేషాచలాశ్రమం పీఠాధిపతి శ్రీ నిర్వికల్పానందస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. సాహితీవేత్తలు యాబలూరి లోకనాథశర్మ, నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి, నారాయణం ప్రసాదాచార్యులు, నోరి నారాయణమూర్తి బ్రహ్మోత్సవాల విశిష్టతను తెలిపారు. సభలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, మండవ వెంకట రామయ్య దంపతులు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



లక్ష్మీపురం: నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నీటిని సంఘర్షణకు కారణం కాకుండా శాంతి, సహకార చిహ్నంగా మార్చాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ నీటి వినియోగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, నీటి రంగ నిపుణులు పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండే విధానం ఆచరణలోకి రావాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సింగరయ్య, అనంతరామయ్య, గుప్తా పాల్గొన్నారు.

విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధి అవసరం



మాట్లాడుతున్న వద్లమాని రవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని రోటరీ ఇంటర్నేషనల్ బోర్డు డైరెక్టర్ వడ్లమాని రవి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్లమాని రవి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని సృజనాత్మక నైపుణ్యాల్ని గుర్తించి, అధ్యాపకుల సహకారంతో వాటిని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విద్యావంతులుగా, నైపుణ్యవంతులుగా ఎదిగి, తల్లి దండ్రులతో పాటు చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో వార్షికోత్సవం ఒక మరపురాని ఘట్టమన్నారు. ప్రతి విద్యార్థి కళాశాల నుంచి ఎన్నో మంచి విషయాలను నేర్చుకుని భవితకు పునాది వేసుకుంటారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో హిందూ కళాశాల ఒక ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు. సమాజంలో ఉన్నతస్థాయిలో రాణిస్తున్న ఎంతో మంది ప్రముఖులకు విద్యాసంస్థలు విద్యను బోధించాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. సుబ్బారావు, మేనేజ్‌మెంట్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



మట్టలతో ర్యాలీగా వస్తున్న చిన్నారులు

నగరంలో మట్టలాదివారం వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్తపేటలోని కుగ్లర్ హాస్పిటల్ ఆవరణలోని ట్రినిటీ ప్యారిష్ చర్చిలో సంఘ కాపరులు రెవరెండ్ జె. దైవాశీర్వాదం, వి. క్రిష్టఫర్ సంఘ సభ్యులతో ఊరేగింపు నిర్వహించారు. ప్రజలను ఆశీర్వదిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బత్తుల లెనిన్, గ్రేస్ సుదర్శనం, భీమ్‌రాజు చిన్నారులు పాల్గొన్నారు. నార్త్ ప్యారీస్ చర్చిలో మట్టల పండుగను శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

– పాత గుంటూరు/ ఫొటోగ్రాఫర్



నార్త్ ప్యారీస్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు



నార్త్ ప్యారీస్ చర్చిలో మట్టలతో చిన్నారుల ప్రదర్శన


భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

పాత గుంటూరు: ఆర్.అగ్రహారం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, స్వామి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, సహస్రనామార్చన నిత్య హోమాలు, వాస్తు, నవగ్రహ, నారాయణ, సుదర్శన హోమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నిత్య హోమం, బలిహరణం, శేష వాహన సేవ, స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం భక్తిప్రపత్తులతో జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పర్యవేక్షించారు.


కనుల పండువగా విద్యాలక్ష్మీ నారాయణుల కల్యాణం



విశేష అలంకారంలో ఉత్సవమూర్తులు

పాత గుంటూరు: అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ చక్రాభిషేకం, నిత్యపూజలు అనంతరం విద్యాలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ మాంగల్య పూజ, ధారణ జరిపారు. పలు పుష్పాలతో అభిషేకం, విశేష హారతి, మంత్రపుష్పం, అష్టోత్తర పూజలతో కార్యక్రమం కనులపండువగా జరిగింది. విశేషంగా దంపతులు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కల్యాణం.. కమనీయం



పూజలు చేస్తున్న మహిళలు

పట్నంబజార్: పాత గుంటూరు సుద్దపల్లి డొంకలో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్యస్వామి కల్యాణం మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం పసుపు, కుంకుమ ఎడ్ల బండ్ల ఊరేగింపు వైభోపేతంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తలారి రాము, పున్నారావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పాదిల మహేష్, బిచ్చాల కృష్ణ, వాసు, కడియాల శ్రీనివాసరావు, బుజ్జి పాల్గొన్నారు. సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో వైద్య శిబిరం

2,500 మంది బోధన, బోధనేతర సిబ్బందికి వైద్య పరీక్షలు



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య శిబిరాలను నిర్వహించడం ద్వారా వివిధ రకాల జబ్బులను గుర్తించి, సకాలంలో వైద్యుల దృష్టికి తీసుకురావచ్చునని ప్రభుత్వ సమగ్రాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రింగ్ రోడ్డులోని భాష్యం బ్లూమ్స్ క్యాంపస్‌లో ఆదివారం భాష్యం గోపి, సరిపూడి హరిబాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగంలో పేరెన్నికగన్న భాష్యం విద్యా సంస్థలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం కృషితో పాటు సిబ్బంది కోసం ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భాష్యం విద్యా సంస్థల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన భాష్యం గోపి సంస్మరణార్థం భాష్యం పేరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించడం ముదావహమని పేర్కొన్నారు. విజయవాడ ఇన్స్యూరెన్స్ మెడికల్ సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్ జగదీప్ గాంధీ మాట్లాడుతూ మెడికల్ క్యాంపుల ద్వారా ముందస్తుగా వ్యాధిని నిర్ధారించి సరైన వైద్యాన్ని అందించడం ద్వారా భవిష్యత్తులో రాబోయే వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చని తెలిపారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం విద్యా సంస్థలకు మూల స్తంభాలైన భాష్యం గోపి, సరిపూడి హరిబాబులను స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామని చెప్పారు. భాష్యం విద్యా సంస్థల ఎదుగుదలలో కీలక భూమిక పోషించిన గోపి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తొలుత భాష్యం రామకృష్ణ, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మితో పాటు వైద్యుల బృందం భాష్యం గోపి, సరిపూడి హరిబాబు చిత్రపటాలకు నివాళులర్పించారు. గుండె, నరాలు, ఎముకలు, జీర్ణకోశ, జనరల్, షుగర్, స్త్రీలు, కంటి, చెవి, ముక్కు, గొంతు, పిల్లలు, చర్మ, ఊపిరితిత్తులు, దంత సంబంధిత విభాగాలకు చెందిన వైద్యులు వైద్య సేవలందించారు. దాదాపు 2,500 మంది భాష్యం బోధన, బోధనేతర సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు వైద్య సేవలు పొందారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెడికల్ క్యాంప్ పాల్గొన్న వైద్యులను భాష్యం రామకృష్ణ దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల డైరెక్టర్ హనుమంతరావు, ముఖ్య సలహాదారు మైఖేల్ రాజ్, మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విషమ పరిస్థితిలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

పాత గుంటూరు: ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నేడు విషమ పరిస్థితుల్లో ఉన్నారని ప్రత్యేక హోదా.. విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం 'ఏపీకి ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి' ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ నిజమైన ప్రజాస్వామ్య ఎన్నికలకు 2024 ఎన్నికలు ఆఖరివని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేడు శాసన వ్యవస్థను చేతుల్లోకి తీసుకుందని, న్యాయస్థానాలను బెదిరించే స్థితికి ఉండటం ఆవేదన కలిగించే అంశమని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రాఫ్ రోజు రోజుకు తగ్గిపోతున్న నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుతో పొత్తులు పెట్టుకునే పరిస్థితికి దిగజారిందని విమర్శించారు. మన రాష్ట్ర హక్కులు కాపాడుకోవాలంటే బీజేపీని ఓడించక తప్పదని పిలుపునిచ్చారు. సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ మన రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై గత 10 సంవత్సరాలుగా సమితి ఏపీ అనేక పోరాటాలు చేసిందన్నారు. మోదీ పాలనలో దేశంలో హింస ధ్వని రాజ్యమేలుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే రాజధాని అమరావతి అవుతుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని, రాజ్యాంగాన్ని వారి చేతుల్లోకి తీసుకొని ఇష్టం వచ్చినట్లు బీజేపీ పరిపాలన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షులు పి.వి.మల్లికార్జునరావు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సేవ కుమార్, సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ నరసింహారావు, కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, బి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు షోకాజ్ నోటీసులు

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఎన్నికలకు సంబంధించి అందిన ఫిర్యాదులపై నిర్దేశిత సమయంలోపు స్పందించడంలో జాప్యంపై ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంకు శనివారం నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పటిష్టంగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలో 24 గంటలు అందుబాటులో ఉండేలా మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో షిఫ్ట్ రెండో బృందం ఆన్‌లైన్ ద్వారా అందిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కారం చేయడంలో జాప్యం చేశారని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పి.ఉమాదేవి, ఎం.ప్రమీల, కె.మహేష్, ఎస్.శ్రీనివాసరావు, వి.ఇందిరలకు 24 గంటల్లో వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.